# సుమతి-వసుమతి

## - పెనుమాక నాగేశ్వర రావు

"డియర్ వసుమతీ,

"ఎలా ఉన్నావు? ఎన్నాళ్ళయిందో కదూ నీకు లెటర్ రాసి? నా మీద కోపం వచ్చిందా? సారీ వసూ. ఏం చేయమంటావ్ చెప్పు? ఎప్పటికప్పుడు నీకు లెటర్ రాయాలనే అనుకుంటాను. ఏదో కారణంగా వాయిదాలు పడుతూ ఇప్పటికి ముహూర్తం కుదిరింది.


"చదివిన చదువుకు సార్థకత చేకూర్చిన దానివి ను వ్వయితే, చదువుకుని కూడా ఉద్యోగం చేయాలనే కోరిక తీర్చుకోలేని దురదృష్టవంతురాల్ని నేను.

"నీకు గుర్తుందో, లేదో మన పెళ్ళిళ్ళు కాక ముందు నీవు ప్రయివేటు ఫరమ్‌లో ఉద్యోగం చేసే రోజుల్లో, ఎవరయినా నీ ఉద్యోగం గురించి మాట్లాడితే మీ అమ్మగారు ఓ మాట అనేది. "ఆఁ.. ఏం ఉద్యోగం, పెళ్ళయ్యేంత వరకేగా, ఆ తర్వాత వచ్చే వాళ్ళకి ఇష్టం ఉంటే చేయించుకుంటారు. లేకపోతే లేదు' అవి డలా అన్నప్పుడల్లా నాకు భలే కోపం వచ్చేది తెలుసా. అయినా కష్టపడి సంపాయించుకున్న ఉద్యోగం, ఇష్టపడి చేస్తున్న ఉద్యోగం, ఆ కాబోయే వాడికి అయిష్టం ;యితే మానేయాలా? అదేమంటే ఇంట్లో పని, ఆఫీను పని చేసుకోలేమని మన మీద ప్రేమ కొద్దీ చెప్పా మంటూ గొప్పలు చెప్పుకుంటారు గానీ, అదే నిజ మయితే ఇంటి పనిలో వాళ్ళూ సహాయం చేయకూడదా ఏం? ఉద్యోగం పురుష లక్షణం, ఇల్లు - ఇల్లాలు అంటూ స్వార్థంతో కూడుకున్న సామెతలు వల్లెవేసి తమ సంకుచితతత్వాన్ని కప్పి పుచ్చుకోవటానికి ప్రయత్నిస్తారే తప్ప, ఆడవారికి స్వేచ్ఛా స్వాతంత్ర్యా లివ్వడానికి ఎందుకు ఒప్పుకోరో కదూ!

"ఏమి టేమిటో రాసేసి బోర్ కొట్టిస్తున్నానా? లేదు వసూ? నా మనసులోని ఆవేదనను, నేను అనుభవిస్తున్న నరకాన్ని నీకు చెప్పుకుని, నా బాధని నీతో పంచుకుని కొం తయినా ఉపశమనాన్ని పొందాలనే రాస్తున్నారు.

"కష్టాలు లేకపోయినా, ఏదో వెలితి. ఇలాంటి విషయాలు మనసులు కలిసిన వారితో చెప్పుకుంటేనే తృప్తిగా ఉంటుంది. అందుకే నా కున్న ఆప్తురాలి వయిన నీకు చెప్పుకోవాలని నా మనసులోని నిరాశని, నా అశక్తతని రాస్తున్నాను.

"ఉద్యోగం చేయాలని నాకు ఎంత కోరికగా ఉండేదో నీకు తెలును కదా. నాన్న గారి అనారోగ్యం కారణంగా చదువు పూర్తి కాగానే సంబంధాలు చూడటం, కొద్ది రోజులలో పెళ్ళి చేసేయడం జరిగిపోయినై. పెళ్ళాయ్యాక ఈయనను ఒప్పించాలని, కనీసం కొంత కాలమైనా ఏదో ఒక



ఉద్యోగం చేయాలని ఆరాటపడ్డాను. తాపత్రయ పడ్డాను. నా ప్రయత్నాలన్నీ విఫలమే అయినై. తర్వా త్తర్వాత ఆ నా కోరికను అణుచుకోవటం తప్ప మరో మార్గం కనిపించలేదు.

"అ దలా ఉంచితే ఇంట్లో నా కున్న ఆర్థిక స్వాతంత్ర్యం గురించి నీకు చెప్పాలి. ఆయనకు వచ్చే ఆదాయం ఎంతో నాకు నిజంగా ఇప్పటికీ తెలియదు. ఏ అవసరాని కయినా ఆయన్ను అడిగి డబ్బు తీసుకోవలసిందే. తీసుకున్న ప్రతి పావలాకు లెక్క చెప్పి తీరవలసిందే. నేను చేసిన ఖర్చు ఆయనకు సంతృప్తిగా లేకపోతే దాని కో రాద్ధాంతం చేస్తారు. దాన్తో వినుగు పుట్టి కొంత కాలం వరకు ఏమీ అడక్కుండా ముభావంతో ఉండి పోతాను.

"నేనుగా ఏం కొనా లన్నా ముందుగా ఆయనకు చెప్పి వారం పదిరోజులుగా అదే పనిగా ఆయనకు గుర్తు చేస్తూ ఆయన గారు వేసే వాయిదా లన్నింటిని ఓపిగ్గా గడిపేసిన తర్వాత తనకి ఇష్టమయితే ఇవ్వనూ వచ్చు. ఇష్టం లేకపోతే ఇవ్వకపోనూ వచ్చు. కొత్తల్లో వీ టన్నింటినీ ఓపిగ్గా సహించాను. ఆయనలో మార్పుని ఆశించాను. కాని మారే మనిషి కాదని అర్థం చేసుకోవడం కూడా అయిపోయింది. ఇలా ప్రతీ దానికి అర్థించి, ఆయన దయా దాక్షిణ్యాల మీద ఆధారపడటం అసహ్యంగానూ, అవమానకరంగానూ ఉంది.

"నీకు ఏం కావాలో చెప్పు తెస్తాను అంటారే గానీ ప్రతి నెలా నా కంటూ కొంత డబ్బు ఇవ్వమంటే మాత్రం ఒప్పుకోరు. అదేం చిత్రమో నాకు అంతుపట్టదు. తనకి ఇష్టమైన వస్తువుల్ని నాతో మాట మాత్రం చెప్పకుండా కొని తెస్తుంటారు. మా ఇంట్లో ఉన్న టి.వి., ఫ్రిజ్ ... వగైరాలు అన్నీ నాకు తెలియకుండా చేరినవే. అవి ఇంటికి వచ్చే వరకూ వాటిని కొంటున్నట్లు కూడా నాకు తెలియదు. నాతో మాట మాత్రం అనలే దేమని ఒకటి, రెండు సార్లు అడిగితే ఆయన సమాధానం ఏమిటో తెలుసా వనూ....

"ఆయన కూడా అప్పటి కప్పుడు అనుకునే తెచ్చారట. అ వేమయినా కుర్చీనో, టీపాయో కాదు కదా రెండు, మూడు వందల్లో కొనటానికి వేల ఖరీదు చేసే వాటిని ఎవరయినా ముందు నుంచి అనుకోకుండా రోడ్డు మీద అలా వెళ్తూ వెళ్తూ సరదా పుట్టి కొనటం సబబుగా అనిపిస్తుందా. దాని క్కూడా సరిపెట్టుకున్నాను. నా క్కూడా అలానే ఏదో చిన్న వస్తువే, పెద్ద వస్తువే కొనా లనిపిస్తే ఆయ్న లాగే కొనుక్కు వచ్చే అవకాశం, అధికారం నాకూ ఎందుకు ఉండకూడదు!

"ఒక రోజు బాగా కోపం వచ్చి ఆయన్నే అడి గేశాను. దానికి ఆయన చెప్పిన సమాధానం - అధికారాలు, హక్కులు అనే పదాల్ని వాడటం తప్పుట. కావలసిన వన్నీ సమకూరుస్తు న్నప్పుడు కూడా డబ్బు లివ్వమని అడగడం కేవలం పెత్తనం చెలాయించాలని, అజమాయిషీ నాదిగా ఉండాలనే కాంక్ష తప్ప మరొకటి కాదట.

"పసి పిల్లలు పది పైసలు కావాలంటూ పేచీ పెడుతుంటారు. డబ్బు లెందుకు, నీ కేం కావాలో చెప్పు, కొనిపెడతా మంటూఅనునయించ బోతారు పెద్దలు. ఎంత చెప్పినా వినకుండా మారాం చేస్తుంటారు వాళ్ళు. చివరికి వాళ్ళని తిట్టడమో, కొట్టడమో చేసి డబ్బు లేం చేసుకుంటావని అడిగితే గాలిపటం కొనుక్కుంటా నంటూ గొణుగుతారు. రేపు నేను తెచ్చిపెడతాన్లే అన్నా వాళ్ళకి తృప్తి ఉండదు. ఆ పది పైసలూ వాడి చేతికొస్తే అందరు పిల్లల్తో పాటు వాడూ కొట్టుకి వెళ్ళి తనుగా కొనుక్కుంటే వాడికి కలిగే ఆనందం వేరు.

"పసి పిల్లలకు, మనకి తేడా లేదని కాదు నేను చెప్పటం. ఇలాంటివే మరెన్నో అనుభవాలు ... అవన్నీ చెప్పుకుంటూ పోతే ఇది లెటర్ గాకుండా ఓ కథ అయిపోతుంది. పక్కింటి వాళ్ళో, ఎదురింటి వాళ్ళో వీధి లోకి వచ్చిన స్టీలు సామాన్ల బండినో, మరో దాన్నో మరొక దాన్నో ఎసెన్నో బేరాలు చేసి కొంటుంటారు. నన్ను కూడా తీసుకోమని బలవంతం చేస్తుంటారు అప్పుడప్పుడు. సహజమే కదా. ఆ వస్తువు మా ఇంట్లో ఉన్నదనో, ఆ మోడల్ నాకు నచ్చలేదనో లేకపోతే నాణ్యత లేదనో ఇలా ఇలా ఏవో వంకలు చెప్పి తప్పించుకోవడమే తప్ప నా దగ్గర నయా పైసా లేదనే విషయం ఎలా వాళ్ళకి చెప్పటం.

" మన దంటూ సంపాయించుకునే టప్పుడు ఇలాంటి కష్టాలు, నిష్ఠురాలు ఉండవు కదా. అందుకే ఆడవారు కూడా తప్పని సరిగా ఉద్యోగం చేయాలి. అన లలాంటి వారికి ఈ ఇబ్బందులు ఉండవు కదూ. అదృష్టవంతురాలివి కనుక నీవూ ఉద్యోగస్థురాలి వైనావు. నీ పరిస్థితిని ఊహించుకు న్నప్పుడల్లా గర్వంతో పాటు, పిసరంత అసూయకూడా కలుగుతుంది నాకు. చక్కగా అటు సంసారం, ఇటు ఉద్యోగం చేసుకుంటూ ఒకరిపై ఆధారపడకుండా నీలా బ్రతకాలి. నా బ్రతుకూ ఒక బ్రతుకేనా?చెపితే నమ్మ వేమో గాని ముగ్గు దగ్గర్నుంచి మల్లె మొగ్గవరకు ప్రతిదీ ... ఏది కొనా లన్నా ఆయన గారి ముందు చేయి చాచాల్సిందే. ఇంకో విచిత్రం చెప్ప మంటావా. ఇంట్లో బీరువాలో కొంత పెద్ద మొత్తమే డబ్బు ఉంటుంది. కానీ ఆ బీరువా తాళం చేతులు మాత్రం మా శ్రీవారి దగ్గరే పదిలంగా ఉంటై.

"ఈ జీవితం ఇలా వెళ్ళి పోవలసిందే. నా సొంత గోడు వెళ్ళ బోసుకుని నీకు వినుగు పుట్టిస్తే క్షమించు. నీ లైఫ్ హాపీగా ఉన్న దనుకుంటాను. భార్యా భర్త లిద్దరూ సంపాయిస్తూ ఆనందంగా ఖర్చు పెట్టుకుంటూ ఉండండి. మీ బాబు, పాప బాగున్నా రనుకుంటాను. మీ శ్రీవారిని అడిగినట్లు చెప్పు. ఓ సారి మీరు మా ఇంటికి వస్తే చాలా సంతోషిస్తాను. తప్పకుండా రావాలి.

"నా ఉత్తరం చేరినట్లు వెంటనే నీ దగ్గర్నుంచి జవాబు వస్తుందని ఆశగా ఎదురు చూస్తుంటాను. బద్ధకించకుండా వెంటనే లెటర్ రాయి.

ఇట్లు
నీ
సుమతి"


ఉత్తరం చదవటం పూర్తి చేసిన వసుమతికి నవ్వు ఆగలేదు. పగలబడి నవ్వాలనిపించింది. కానీ ఆఫీసులో అంతా విస్తుపోయి చూస్తారని బలవంతంగా నవ్వును ఆపుకుంది. సుమతి ఉత్తరం వసుమతి మనసులో అలజడి సృష్టించింది. ఆవేశం కలిగించింది. అందుకే వెంటనే కలం. కాయితం తీసుకుని స్నేహితురాలికి ఉత్తరం రాయటం ప్రారంభించింది.

"ప్రియమైన సుమతికి

"మేం అందరం క్షేమం. ఇప్పుడే చేరిన నీ ఉత్తరం ద్వారా నీ క్షేమ సమాచారాల్తో పాటు చాలా విషయాలు తెలుసుకున్నాను.

"తెలిసీ తెలియని వయసులో ఆవేశం వల్లనో, అమాయకత్వం వల్లనో మనం రకరకాల ఆలోచన్లు చేస్తాం. రకరకాల అభిప్రాయాలను ఏర్పరచుకుంటాం. అనుభవంలోకి వచ్చే సరికి అసలు నిజాలు మనల్ని వెక్కిరిస్తాయి. ఆ వెక్కిరింత మనకి ఉక్రోషాన్ని కలగచేస్తుంది. ఆవేశ పడటం తప్ప ఆచరణ సాధ్యం కాదు ఏదీ!

"సర్దుబాటు మనస్తత్వం ఆడ మనిషికి భగవంతు డిచ్చిన వరమో, శాపమో, ఎంతగా ఆలోచించినా అంతుపట్టదు నాకు. ఎక్కడి దాకో



ఎందుకు? పెళ్ళి చేసుకునే విషయంలోనే స్త్రీ రాజీపడక తప్పుతుందా. నచ్చిన మనిషి తారసపడే వరకూ పెళ్ళి చేసుకునే ప్రసక్తే లేదంటూ పట్టుపట్టి కూర్చున్న మన క్లాస్‌మేట్ నీలిమ .. చివరికి ఏం చేసింది. పెళ్ళికి ముందు మనకి ఏమని రాసింది? ఎవడో · ఒకడు తప్పదుగా.... అందుకే చేసుకుంటు న్నాను అని కదూ రాసింది. ఓ నాలుగు సంబంధాలు చూశాక నలుగురికీ అమ్మాయి నచ్చితే, ఆ అమ్మాయికి మాత్రం ఆ నలుగురిలో ఏ ఒక్కడూ నచ్చ లేదని చెప్తే బయట వాళ్ళ దాకా అక్క ర్లేదు. ఇంట్లో వాళ్ళ సూటీ పోటీ మాటలు చాలు విరక్తి పుట్టటానికి. అటు తర్వాత బయట వారి హేళనలు కూడా తోడయితే ఎవరో ఒక రంటూ రాజీపడక తప్పుతుందా మరి?

"మొన్నీ మధ్య ఎక్కడో చదివాను. అష్ట కష్టాల్లో 'శత్రు స్నేహం' కూడా ఒకటిట. అంటే వృత్తి రీత్యా కాని, ప్రవృత్తి రీత్యా కానీ భేదభావం ఉన్న మనిషి తప్పని సరిగా స్నేహం చేయవలసి రావటంట.

"సగం పైగా ఆడవాళ్ళు భర్తల్తో చేస్తున్నది కాపురాలు కావేమో శత్రు స్నేహాలే నేమో ననిపిస్తున్నది... అవును కదూ .. అఫ్‌కోర్స్ మగవారిలో కూడా కొందరు అలా ఫీలవుతుండే వాళ్ళు ఉండ వచ్చునుకో."

"ఇక పోతే ఉద్యోగం చేసే ఆడ వాళ్ళందరూ మహా సుఖపడిపోతున్నా రనుకుంటు న్నావు కదూ! పిచ్చి సుమతీ! నీది చాలా పొరపాటు. ఎవరి దాకానో ఎందుకు నీకు నేనే ఉదాహరణ.

"సంపాదిస్తున్నది ఎవరు అనేది కాదు కావలసింది. ఆ సంపాదన స్వేచ్ఛగా వినియోగించుకుంటున్న వాళ్ళు ఎవ రనేది ముఖ్యం. మన ఇళ్ళల్లో పాచి పనిచేసే పని మనుసులు కూడా సంపాయిస్తున్నారు. సారా కోసం మొగుడనే మగాడు నాలుగు తంతే ఆ కష్టార్జితాన్ని అతని చేతి కందిస్తున్నారు. మరి ఆ సంపాదిస్తున్న ఆడవాళ్ళు ఏం అనుభవిస్తున్నా రంటావ్. పైగా పావం వాళ్ళు సంపాదించేది వాళ్ళ అనుభవం కోసం కాదు. సంసారం పోషించేందుకే కష్టపడ్డా వినియోగపరిచేది మాత్రం అందు క్కాదు.

"అలాంటి వారి కంటే నేను, నా లాంటి వారు ఎంతో నయం గదా అనుకుంటాను. ఎందుకంటే నా, జీతం తెచ్చి ఆయన చేతి కివ్వడంతో నా బాధ్యత తీరిపోతుంది. మిగిలిన బాధ్యత లన్నీ ఆయనవే. [నేను ఒద్దన్నవి కావు].

"నెల నెలా నాకు వచ్చే జీతాన్ని ఆయనకు ఇచ్చి పూస గుచ్చినట్లు వివరా లన్నీ చెప్పాలి. పదే, పాతికో తప్పని సరై ఖర్చు పెడితే దాని తాలూకు పూర్తి వివరాలు, ఏ పరిస్థితుల్లో ఆ ఖర్చు చేసింది వివరంగా చెప్పాలి. ఆ ఖర్చు వారికి దుబారా అనిపిస్తే చేసిన ఖర్చుకు సంజాయిషీ చెప్పుకుని ఇకపై చేయనని మాట కూడా ఇవ్వాలి.

"అంతే కాదేయ్ సుమతీ! నా జీతంలో హెచ్చు తగ్గులకు కారణాలను సాక్ష్యాధారాలతో నిరూపించాలి. అప్పటికీ అనుమానం తీరక వేరే మార్గంలో ఆయన స్వయంగా ధ్రువపరుచుకుంటా రనేది వేరే విషయం.

"స్వతంత్రించి ఎప్పు డయినా జీతం రాగానే ఇంట్లోకి కావలసిం దేదయినా కొనుక్కు వస్తే "సంపాదిస్తున్నా ననే ధీమాతోనేగా నాతో మాటయినా చెప్పకుండా కొన్నావ్. నీ సంపాదన నీ ఇష్టం అన్నమాట, మొగు డనేవా డొక డున్నాడని గూడా గుర్తుండదు మరి" అంటూ రకరకాలుగా మాటల్తో హింసించి ఇంకెప్పుడు ఇలా చేయకూడ దనిపించేటంత విరక్తి పుట్టిస్తారు. ఇదే నియమం [మగ] వారికి మాత్రం వర్తించదు సుమా!

"సంపాదన నాదే అయినా దానిలో ప్రతి పైసా ముందుగా వారి అనుమతి తీసుకుని మాత్రమే ఖర్చుపెట్టుకోవాలి. ఇలాంటి సంపాదనలో తృప్తి ఉంటుం దంటావా మై డియర్ సుమతీ! నా బేసిక్ పేలు, డి.ఎలు వగైరా, వగైరాలు ఎంతెంతో సహృదయంతో చెప్పినా, నమ్మకం కుదరక ఎవరెవరి దగ్గరో తను ఆరాలు తీసినట్లు తెలుసుకున్న నేను- నన్ను నేనే ఎన్నిసార్లు అసహ్యించుకున్నానో తెలుసా!

"ఓ సారి ఏ మయిందో తెల్సా. ఆయనగారు ఆఫీసులో లోన్‌కి అప్లయ్ చేశారట. లోను శాంక్షనై వచ్చాక ఇంటికి వస్తూ వస్తూ కలర్ టీ.వీ. కొనుక్కుని వచ్చేశారు ఏకంగా. లోన్‌కి అప్లయ్ చేసే టప్పుడు కాని, శాంక్షన్ అయినప్పుడు కానీ, కనీసం టీ.వీ. కొనబోయే ముందైనా నాతో ఒక్క మాట చెప్పి ఉంటే సంతోషించే దాన్ని కదా. ఆ మాటే తనతో అంటే ఎంతగా చిరాకు పడ్డారో తెలుసా. "ఇంటికి టీ.వీ. వచ్చిందని సంతోషం లేకుండా ఏమి టీ సాధింపులు, ఛీ ఛీ మీ ఆడవాళ్ళ బ్రతుకే అంత. అడక్కుండానే అన్ని సమకూరుస్తుంటే ఇలాంటి బుద్ధులే పుడుతుంటాయ్ కాబోలు. ఏదో .. చెప్ప లేదు, అయితే మాత్రం ... " అంటూ ఓ పెద్ద గొడవ చేసేశారు. అలాంటి వన్నీ మనసులో పెట్టుకోకుండా ఆయన ఏం చేసినా చిరునవ్వు చెదరకుండా మెచ్చుకుంటూ, లేని సంతోషాన్ని కుమ్మరిస్తూ ఉండాలి. ఎలా సాధ్యం.

"ఓ తమాషా చెప్ప మంటావా - మా వారు టీ.వీ. కొనుక్కు వచ్చిన నెలరోజుల తర్వాత ఓ రోజు భోజనాల దగ్గర..

"ఏ మండీ! నాకు లోన్ శాంక్షన్ అయింది. రేపు మనింటికి ఫ్రిజ్ వచ్చేస్తున్నది" అన్నాను.

"అంతే-ముంద రున్న కంచాన్ని విసురుగా నా వైపు తోసేశారు.

"భయంతో బిక్కచిక్కిపోయా ననుకో.

"నేను నీకు చెప్పకుండా టీ.వీ. తెచ్చాననే వంతం కొద్దీ నాకు చెప్పకుండా ఫ్రిజ్ తేవాలనుకున్నా వన్నమాట?" కోపంగా, నిష్ఠురంగా అడిగారు.

....

"ఇలాంటి తిక్క తిక్క పన్లు చేశావంటే ఉద్యోగం మానుకోవాల్సొస్తుంది జాగ్రత్త" హెచ్చరింపు.

"నేను మాను కోను." మొండిగా అన్నా న్నేను.

"మాను కోకుండా నీ ఇష్టం వచ్చినట్లు నువ్వు వ్యవహరించ దలుచుకుంటే మనం కలసి ఉండటం ..."

"ఆగం డాగండి .. ఇదే పని మీరు చేసినప్పుడు నే నీ మాట అనలేకపోయాను. మీరు అన గలిగారు. అందుకు ఒకే ఒక్క కారణం మీరు మగ - నేను ఆడ ... అంతేనా, మరింకేమైనా కారణం ఉందా?" సూటిగా అడిగాను.

"ఈ 'లా' పాయింట్లు, లాజిక్కులు నా కనవసరం, అసహ్యం కూడా. నాకు నచ్చే పద్ధతిలో నడుచుకునే మనిషి నాకు భార్యగా ఉండాలి.. అంతే." చెప్పేశారు.

"ఇక ఆ ప్రస్తావన పొడిగించటం ఇష్టం లేక ఊరుకుండి పోయా న్నేను.

"ఈ మాట చెపితే నీకు కోపం వస్తుందని తెలుసు కాని చెప్తేస్తున్నాను... ఆ మర్నాడే నేను నా లోన్ కాన్సిల్ చేసుకున్నాను. మరో వారం రోజులకు ఆయనే ఫ్రిజ్ కొనుక్కువచ్చారు."

"ఉద్యోగం చేస్తున్నావు కదా విడిపోదాం అంటే సరే ననక పోయావా నీ కేంటి బ్రతకలేననీ భయం లేదు కదా అనుకుంటూ వేమో - ఉద్యోగం చేయాలనుకునేది - చేస్తున్నది మొగుడు వెళ్ళి పొమ్మంటే ఆధారం కోసం మాత్రమే కాదుగా. ఉద్యోగం ఉన్నది కదా అని విడిపోవడం అంత సులభం కాదు. అదే నిజమయితే ఉద్యోగం చేస్తున్న నా లాంటి ఆడవారంతా ఈ పాటికి భర్తల్ని వదిలేసి ఉందురు. ఉద్యోగం ఒక్కటే జీవితం కాదుగా.

"ఉద్యోగం చేస్తున్న నాకు, ఇంటి పట్టునే ఉంటున్న నీకు ఉన్న ఆర్థిక స్వాతంత్ర్యంలో తేడా ఏపాటిదో ఈ పాటికి అర్థం అయ్యే ఉంటుం దనుకుంటున్నాను.

"సహృదయుడు, సంస్కార వంతుడు అయిన మగవాడు మొగు డయితే సంసారాలు సంతోషంగా, సవ్యంగా సాగుతయ్యే కానీ, సంపాదనల్తో కాదుసుమా! సంపాదించుకుంటున్న స్త్రీలంతా ఆర్థిక స్వాతంత్ర్యం అనుభవిస్తున్నా రను కోకు. నా లాంటి ఉద్యోగినుల కంటె నీ లాంటి గృహిణులే నయం. ఇవన్నీ నిజాలే సుమా! నిజం చెపితే నిష్ఠురంగా ఉంటుందిట మరి!

"ఉంటాను.

నీ

వసుమతి.

## లక్ష ద్వీపాలు

లక్ష ద్వీపాలు 36 ద్వీపాలతో కూడిన సమూహం. ఇవి 32 చదరపు కిలోమీటర్ల ప్రాంతంలో విస్తరించి ఉన్నాయి. వీటిలో ఆంద్రాట్ ద్వీపం పెద్దది. బిత్రా ద్వీపం చిన్నది. పది దీవులలో మాత్రం ప్రజలు ఆవాస ముంటున్నారు. 1981 జనాభా లెక్కల ప్రకారం ఈ దీవుల జనాభా 40,249. ఇక్కడి ప్రజలు కొబ్బరి పెంపకం, చేపలు పట్టడం ద్వారా జీవనం కొనసాగిస్తున్నారు. పశు పెంపకం ఈమధ్యే చేపడుతున్నారు. మంచి బొప్పాయి పండ్లకు ఈ ద్వీపాలు ప్రసిద్ధి. ప్రకృతి సౌందర్యానికి నిలయాలైన ఈ ద్వీపాలను గత సంవత్సరంలో లక్షకు పైగా యాత్రికులు సందర్శించారు. ఇక్కడ లభించే విలువైన ఔషధ మూలికలను బొటానికల్ గార్డెన్‌లో సంరక్షిస్తున్నారు.

- నమ్మెట గోవర్ధన్